# నీ - వెనుక - నేను

ఆనాడు నువ్వు పోయావు. నీ ఆఖరు క్షణాల్లో నేను దగ్గిరే ఉన్నాను. నువ్వు ఏదో లోకంలోకి చూస్తున్నావు. నీరసంగా కమిలిపోయిన ముఖంలో మాకు తెలియకుండా నవ్వుని దాచుకుంటున్నావు. మీదికి వంగి 'అమ్మా' అంటూ పలకరిస్తున్న బాలూ, ఉయ్యాల్లో గుక్కపెట్టి ఏడుస్తున్న చిన్నది, సర్వస్వం పోగొట్టుకోబోతున్న నేను—మమ్మల్నెవర్నీ నువ్వు చూట్టంలేదు.

నువ్వు ఆరిపోయేలోగా నాకేదైనా చెబుతావని ఆశ. చిన్నపిల్లాడిలా నువ్వు చెప్పే మాటలకి "ఊ" కొడ్తూ, తలకాయ వూపుదామని వుబలాటం. ఏం చెప్తావ్ నువ్వు నాకు? జీవితమంతా నేను చెప్పింది చెయ్యటంతప్ప నాకేం చెప్పలేదు. నాకు తెలుసు ఇప్పుడూ ఏమీ చెప్పవు. చిక్కిపోయిన నీ చెక్కిళ్ళమీద, గాలి విసురికి చెదిరే నీ ముంగురులు నిన్నెక్కడికో లాక్కుపోతున్నాయి. ఆ లోకపు సరిహద్దులు తాకిన నీ చూపులు మా వైపు తిరగవు. ఆరిపోయే దీపం భగ్గున మండినట్లు నీ ముఖంమీద సన్నగా చిరునవ్వు కదిలింది—అంతే. ఉయ్యాల్లో చిన్నది గుక్క విడవకుండా ఖంగుమని ఏడుస్తోంది. బాలూ భయంగా గోడవైపు చూస్తున్నాడు. నేను నీలోకే చూస్తున్నాను. నిన్నటిదాకా నాలో శక్తులన్నిటినీ కూడగట్టి నడిపింపజేసిన నీ మూర్తి నిర్జీవంగా, మట్టిలో కలిసిపోవడానికి సిద్ధంగావుంది. లోకంలో ఎవరైనా భార్యకు న్యాయం చేశానంటే అది ఘాతుకమైన అబద్ధం అనిపించింది. నీకు తెలియదు,

చెప్తే కంట నీరెడ్తావు. రెండు చేతుల్తో నీ పాదాలు కడిగి కళ్ళ కద్దుకున్నాను.

పూల తోటలో వేపచెట్టు కింద ఎడంపక్కగా సమాధి చేశాను—కుడిపక్క నాకు ఖాళీ ఉంచుకొని. చూస్తున్నావుగా మొగాడి స్వార్థం! నా గుండెలో చీకట్లు చిమ్మకొడుతున్నాయ్. ఇంట్లో ప్రతి చిన్న వస్తువునీ తలపిన్ను దగ్గర్నుంచి నాకు మూర్ఛ తెప్పించగల శక్తి కలదైంది. ఆముదం దీపం కొడిగట్టి పేలవంగా వెలుగుతోంది. గోడమీద బల్లి పురుగులు మింగుతోంది. పైనున్న ఆకాశం చెక్క ఒకటి విరిగి 'ఫెళఫెళా' నా మీద విరుచుకు పడకూడదూ — పడదు. కింద నుల్చున్న నేల రెండుగా విచ్చుకుపోయి నన్ను మింగెయ్యకూడదూ — మింగదు. నా దేహం మధ్యకి రెండుగా చీలి ఛిన్నా భిన్నం కాకూడదూ — కాదు. ఎవరికి తెలియకుండా నా గుండె ఠక్కున ఆగిపోయి ప్రాణాలు గాలిలో ఎగిరిపోకూడదూ — పోవు. నాకు తెలుసు. ఏవీ జరగవు. ప్రళయం రాదు — దావానలం పుట్టదు. కనీసం మొదళ్ళతో లేచి చెట్లు కూలిపోయే టందుకు గాలివాన కూడా రాదు. నన్ను చెక్కుచెదర నివ్వదు ప్రకృతి. ఆలంబన లేకపోయినా నేలమీద పాకిపోయే తీగలా బతకాలి. ఎగసన తోసే పుల్ల లేకపోయినా కొడిగట్టిన దీపంలా జీవించాలి.

దూరాన దివాణంలో పన్నెండు గంటలు కొట్టారు. చిన్నది ఎప్పుడో నిద్రపోయింది. బాలూకి ఇప్పటి దాకా ఏవో కథలు చెప్తూ నిద్రపుచ్చే ప్రయత్నం చేస్తున్నాను. ఎంత ఉల్లాసమైన కథ చెప్పినా, గొంతు జీరపోతే చాలు వాడు బిక్క మొహం పెట్తాడు. ఇన్ని సున్నితాల్ని పట్టు

కోగలగడం ఎవరు నేర్పారు వాడికి? వాడూ నిద్రకు జోగుతున్నాడు.

సమాధి చుట్టూ చీకటి గుబురుగా మూసుకుంది. పైన వేపచెట్టు భూతంలా తలలు విసుర్తూ గాలి కొడ్తోంది. సమాధి మీద పాలరాయి నున్నగా, నీదేహంలా, చెయ్యి వేస్తే జారిపోతోంది. నువ్వు సమాధి పగల గొట్టుకు వచ్చి నా మాసిన తలని నిమిరి ఓదారుస్తావని ఆశ – రావని తెలిసి కూడా అదే కోరిక. సమాధి రాళ్ళమీద తల ఎంత బద్దలు కొట్టుకున్నా తల పగలదు. దెబ్బ తగలదు. కన్నీరు సముద్రాల్లా పొంగుతున్నా కను కొలుకుల నుండి కిందికి జారదు – ఏమిటి నాకీ రౌరవ నరకం? నన్ను హాయిగా ఏడవ నివ్వవు. నాలో ఏదో మంత్రించి మనిషిని చేస్తానంటావు. ఝంఝూమారుతం వేగంగా దూసుకుంటూ నాదాకా వచ్చి ఆగి నా చుబుకం పట్టుకుని బుజ్జగించి వేగం తగ్గి, ఆశా భంగం చెందినట్లు మెల్లిగా కదిలి పోయింది. గుడ్లగూబ 'ఈ ఘోరాలు చూట్టానికా నన్ను రాత్రిళ్ళు తిరగమన్నావ్?' అని దేవుణ్ని గురించి గావుకేక పెట్టింది. చెట్లన్నీ కట్లు తెంచుకున్నట్లు శివాలెత్తి వూగుతున్నాయి. నాలో పొంగుతున్న బడబానలం నాలో ఇమడక బైటికి పొర్లుతోంది. మబ్బుల్లాంటి నా చేతుల్తో సమాధి నంతా తాకాను. 'బుస్' మని తెల్లగా ఏదో పాకి పోయింది. కత్తిలా మెరిసిన తెల్ల తాచు వెనక్కి తిరిగి చూసి ఉసూరుమని తోక జార్చుకుంటూ పక్క పొదలో కలిసిపోయింది. ఇంతలో నీ వాసన చందనం పూతలా తగిలింది. నరాలు జివ్వుమని ఒక్కసారి సంచలనం పొందాయి. రక్తం ప్రవహించే వేగానికి రక్తనాళాలు తెగి

పోయేటట్లున్నాయి. కాలిపోతున్న నా ఒళ్ళు, తుపానులో వూగుతున్న ఆకులూ, కొమ్మలూ లేని మొండి చెట్టులా విరుచుకుంటోంది. తెల్లటి పాలరాయి నిగనిగలాడుతూ నవ్వుతోంది. సంపంగి వాసన గాలితో కలిసి తోటలో కోట కట్టింది. ఆనాడు నువ్వు పోయిన నాడు నాటిన సంపంగి నేడు పువ్వు పూసింది. ఏ ఆకర్షణలు, అలంకారాలు లేకుండా కొమ్మకింద ఆకుల చాటున అణుకువతో దాగి, గాలిపోగలిగిన చోటు దాకా తన ఉనికిని తెల్పే సంపంగికి నీకూ తేడా కన్పించటం లేదు. నీవు బతికున్నంత కాలం నీకు సరైన సామ్యం చెప్పలేక పోయాను. ఈ నాడు నీ సమాధి పక్కన సంపంగిని తోడు చేసి నందుకు నాకు తృప్తి. ఈ నాగరాజు స్నేహం ఎప్పుడు సంపాదించావ్ ? ... ఎందు కా నవ్వు ? నువ్వు చీర చెంగు చాటున ముసి ముసిగా నవ్విన కాంతుల్ని నీ సంపంగి, వాసన రూపంలో విసిరి విసిరి కొడ్తోంది.

లేత సూర్యకిరణాలు తట్టి లేపుతుంటే నువ్వేమో అనుకున్నాను. కిటికిలోంచి తోటలోకి చూస్తే సమాధిమీాది పాలరాయి అరుణకిరణాల పూతతో నిగనిగలు పోతోంది. అప్పుడే నిద్రమంచంమీాదినుంచి లేచినప్పుడు నీ నుదుటిమీాద అంటుకున్న వెంట్రుకల్లా సమాధిమీాద చెల్లాచెదురుగా ఆకూ అలం పడివుంది. బాలూ వాడి బుల్లి చేతుల్తో అవన్నీ తీసేసి శుభ్రంచేస్తున్నాడు. చిన్నది బుడ్డిచెంబుతో నీళ్ళు దారగా ఒలకపోసుకుంటూ తీసికెళ్ళి — సమాధిముందు చల్లుతోంది. అన్నా చెల్లెలు కళ్ళాపిచల్లిన నేలమీాద వంకరటింకర్లుగా పిచ్చి ముగ్గులేవో వేస్తున్నారు. వాళ్ళ చిన్నారిచేతుల్తో గుత్తులు గుత్తులుగా, కుప్పలు కుప్పలుగా నీమీాద పువ్వులు కురిపిస్తు

న్నారు. ఒకళ్ళకొకళ్ళు దగ్గిరగా ఆనుకుని నుంచొని లేత చేతులు ముకుళించి నమస్కారం చేస్తున్నారు. నీ సంపంగి, నాగరోజా తలలు నిక్కించి చూస్తున్నారు.

ఎప్పుడు నేర్పావు వాళ్ళకిదంతా? ఏమని ప్రార్థిస్తున్నారు? నువ్వు వాళ్ళని ఏమని దీవిస్తున్నావ్? ఈ తల్లిలేని బిడ్డల్ని చూస్తున్న నాకు కంటివెంట నీరు రావటంలేదు. గుండె ఘనీభవిస్తోంది. మరీ గట్టిపడి రాయవుతోంది. ఏనాడో ఫెళ్ళుమని చెక్కలవుతుంది.

కాళరాత్రి వీపుమీద చెళ్ళున చరిచి లేపింది. పిచ్చిగా సమాధిదగ్గరికి పరుగెత్తాను. దోవలో అడ్డురాయి తగిలి బోర్లా పడ్డాను. కోనురాయి పక్షపాతం లేకుండా 'సర్రున' నుదురు చీల్చింది. ఎక్కడో మబ్బు వికటంగా ఉరిమింది. అరచేతితో ఒత్తుకొన్నాను. ఆ నెత్తురుచేతుల్తో — సమాధిమీద వచ్చి పడ్డాను. సమాధిని కౌగలించి గిలగిలమంటున్నాను.

'ఏమిటి నాకీ మహానరకం?'—

ఎట్లా అడగ్గలుగుతున్నాను ఈ నోటితో—నీకు న్యాయం చెయ్యలేనితనం చాలదూ—నీ ఋణం తీర్చుకోలేని అశక్తత చాలదూ—ఈ పాపం అనుభవించటానికి నువ్వంటే ఈ సమయంలో ఏంచేసేదానివి? నా గుండె పగిలేటట్లు దీనంగాచూసి, నన్ను కృతజ్ఞుడిగా నవ్వించి, డ్రైవానికి ముడుపుకట్టి ఉపచారం చేసి, నా బాధ లాగేసుకుని, నేను తీర్చవలసిన ఋణం పెంచేదానివి. నుదుటిమీది చర్మపు పొరల్లోంచి కారే రక్తం కన్నీళ్ళలో కలుస్తోంది. బొట్లుబొట్లుగా సమాధి పాలరాతిమీద పడ్డ నా నెత్తుటిచుక్కలు నీ ముత్తైదుతనాన్ని చెపుతున్నాయి. నీ సంపంగివాసన నా గాయానికి పట్టువేస్తోంది—

అదిగో సంపంగి! ఇన్నాళ్ళకి నా కంటికి కన్పించింది. ఈ మహ త్తర దర్శనంలో నీ రూపం సాక్షాత్కరిస్తోంది. ఇన్నాళ్ళగా ఆకుల ముసుగులచాటున దాచుకున్న నీ ఆకృతి-నాక్కావాలి. వద్దు-వద్దు ఇకనుంచి నేనేమీ ఆశించను. నీ నుండి నేను పొందినదానికి ప్రతిఫలం ఇవ్వలేకపోయిన నేను-ఇంక ఏమీ కోరను. కాదు కాదు-నాక్కావాలి. నీ ఋణభారం ఇంతై, అంతై, కొండంతై మేరువంత కావాలి. నీకు చేస్తున్న అన్యా యాన్ని ఎంత ఎక్కువగు ర్తిస్తానో, నీమీద అంత ప్రేమ పొందు తాను. నీకు ఎంత అన్యాయం చేయగలనో అంతా చెయ్యాలి. ఆ తర్వాత పశ్చాత్తాపంతో కుమిలి కుమిలి నీరసించి, కృశించి జీర్ణమై పోవాలి. నీ సంపంగిని కోస్తాను. నిన్ను కౌగిట్లో క్రూరంగా, గాఢంగా హత్తుకుని వత్తిలా వాడ్చేసినట్లు అదుము కుంటాను.

నాలో రాక్షసుడు లేస్తున్నాడు. విశృంఖలంగా విచ్చల విడిగా విలయ నృత్యం చేస్తున్నాడు. – చెయ్యాలి – ఇంకా చెయ్యాలి. చేసి చేసి ఒక్కమారు కుప్ప కూలి పోవాలి. నాలో పశ్చాత్తాపం మహాగ్నిలా పొంగాలి. అందులో నేను నిలువునా కాలి, మసై, బూడిదై, రేణువునై, అనామకంగా ఎందుకూ కొరగాకుండా గాలిలో ఎక్కడికో పోయి పడి పోవాలి.

గాలి నా చుట్టూ సుళ్ళు పెట్టి గిరగిరాలు తిరుగుతోంది. మబ్బులు ఒకదాన్నొకటి మహావేగంతో ఢీకొని గాండ్రు మని గర్జిస్తున్నాయి. కొలిమిలో ఇనుప కమ్మి పెట్టి కెలికినట్లు నాలో మంట ఉవ్వెత్తుగా భగ్గుమని లేచింది. నా నెత్తుటి చేతుల్తో సంపంగిని పట్టుకున్నాను. హంతకుడు గొంతు పిసుకు

తూన్నట్లు గిలగిల కొట్టుకుంది. కరుడు గట్టిన రాక్షసత్వంతో కళ్ళతో చింత నిప్పులు కక్కుతూ టప్పున తెంపాను. దూరంగా పెద్ద పిడుగు పడింది. జర్రున తెల్ల తాచు దూసుకొచ్చి 'కసుక్కున' నా చెయ్యి కాటందింది.

కాని సంపంగిని విడిచి పెట్టలేదు. దాన్ని నీ సమాధి మీద ఉంచాలి. సమాధి మీది పాల రాయి నెర్రవిచ్చి ముక్కలు ముక్కలుగా పగిలింది. 'పిచ్చి తల్లీ' సంపంగికీ నాగరాజుని కాపుంచావా? ఇప్పటికి తెలిసిందా, మగవాడి ఒంట్లో ఎంత విషం ఉండేది? అడుగో నీ నాగరాజు నన్ను కాటేసినందుకు నిర్జీవంగా పడి ఉన్నాడు. విషం నాలోకి సర సర ఎక్కుతోంది. ఎంత హాయిగా ఉంది. నాలోని విషంతో పోలిస్తే నాగరాజు విషమెంత? గతంలో పడ్డ బాధకంటే ఇది వెయ్యి రెట్లు నయం.

వర్షం కుండల్తో పోస్తూ వడగళ్ళు గుమ్మరిస్తోంది. వేప చెట్టు మధ్యకు చీలి కూలి పోయింది. విషం రక్తనాళాలు చీలుస్తూ పైకి పాకుతోంది. నాకు హాయిగా—శాంతిగా ఉంది. నా కళ్ళు చీకట్లు కమ్ముకుతున్నాయి. నే నెక్కువ మాట్లాడలేను. నిన్ను ఒక్కటి అడుగుతాను నువ్వు నా కేదైనా శిక్ష చెప్పాలి — లాభం లేదు. చెప్పి తీరాలి.